www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 ఫిబ్రవరి 2023
5
తిరుపతి



లోకేష్ సభ ఏర్పాట్లు పరిశీలన

శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర బహిరంగసభ ఏర్పాట్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ నెల 17వ తేదీన లోకేష్ పాదయాత్ర శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి అడుగు పెడుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తొట్టంబేడు మండలం రామచంద్రపురం సమీపంలోని పీవీఆర్ గార్డెన్‌లో లోకేష్ భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సుధీర్ ఏర్పాట్లను పరిశీలించి త్వరిత గతిన పూర్తిచేయాలని సూచన చేశారు. గాలి చలపతి నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, మురళీ నాయుడు, చెంచయ్య నాయుడు, కంఠారమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డి కట్టింగ్‌ల ముఖ్యమంత్రి

- దళితులకు మెరుగైన టెక్నాలజీతో తమ ప్రభుత్వమే ఇళ్లుకట్టిస్తుందని హామీ

మహిళా కూలీలతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి- పిచ్చాటూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 20వ రోజు సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలోని కీళ్లపూడి గ్రామం నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.40గంటలకు వెంకటరెడ్డి కండ్రిగలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. సాయంత్రం 6.35 గంటలకు సదాశివపురంలో స్థానికులతో లోకేష్ మాటామంతీ నిర్వహించారు. మరోవైపు పాదయాత్రకు ముందు సెల్ఫీవిత్ లోకేష్ కార్యక్రమంలో యువనేత ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ అభిమాన నేత అప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు దిగడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కీళ్లపూడిలో ఎస్సీ సామాజికవర్గం యువతతో ముఖాముఖి కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. వారు తమ సమస్యలను లోకేష్‌కు విన్నవించుకున్నారు. లోకేష్ మాట్లాడుతూ చీర, గాజులు ఇచ్చేందుకు వెళ్లిన దళిత మహిళలను దాతరుణంగా కొట్టారని, కేసులు పెట్టి జైల్లో పెట్టారని లోకేష్ మండిపడ్డారు. రాజధాని విషయంలో జగన్ మళ్ళీ మోసం మొదలు పెట్టారన్నారు. కర్నూలు, అమరావతిలకు మోసం చేసినట్టే, విశాఖకు మోసం చేస్తారని అన్నారు. జగన్ రెడ్డి దళితుల పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దళితులకు ఇంటిపట్టాలు ఇస్తున్నట్టు చెప్పి తమిళనాడు వారికి ఇస్తున్నారంటూ లోకేష్‌కు దళితులు ఫిర్యాదు చేశారు. మెరుగైన టెక్నాలజీతో తమ ప్రభుత్వమే ఇళ్లుకట్టిస్తుందని హామీ ఇచ్చారు. ఇంటికి ఒక పింఛన్ విధానం పేరుతో కుటుంబాలను విడగొడుతున్నారని, తాము కుటుంబాలు విడగొట్టకుండా పింఛన్లు అందిస్తామని తెలిపారు. జగన్ తెల్ల రేషన్ కార్డులు తీసేయాలి, ఎలా పింఛన్లు కట్ చేయాలి, పింఛన్ తగ్గించాలి అని ప్లాన్ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కట్టింగ్‌ల ముఖ్యమంత్రి అని వ్యాఖ్యలు చేశారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలుచేసి అంబేద్కర్ రాజ్యాగాన్ని అవమానిస్తున్నారని అన్నారు. మళ్ళీ అంబేద్కర్ రాజ్యాంగం అమలు అయ్యేందుకు ఏం చేయాలో చేసి బుద్ధి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. జగన్ దళిత ద్రోహి అని అన్నారు. విదేశీవిద్య పునరుద్ధరిస్తామని నియోజకవర్గంలో ఒక అంబేద్కర్ భవనం ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

అనంతరం పాదయాత్రగా సాగిస్తూ పిచ్చాటూరు శ్రీకాళహస్తి జంక్షన్‌లో ఎదురైన ఓ ఆర్టీసీ బస్సును ఎక్కి ప్రయాణికులను ఆప్యాయంగా పలకరించారు. టీడీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలు.. వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీల మధ్య వ్యత్యాసాన్ని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఛార్జీలు పెంచి విపరీతంగా భారం పెంచారని లోకేష్‌కు విన్నవించారు. వైసీపీ ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి వారు ప్రయాణించే ఆర్టీసీ ఛార్జీలను మూడుసార్లు పెంచిందని మండిపడ్డారు. జగన్‌రెడ్డి బాదుడే బాదుడుకు ప్రజలపై విపరీతమైన భారం పెరిగిందన్నారు. పెంచిన ఆర్టీసి ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీనం చేస్తే ఆర్టీసీ కార్మికుల జీవితాలు మారిపోతాయి అన్నారని... విలీనం చేసి గాలికి వదిలేశారని విమర్శించారు. విడిగా ఉన్నప్పుడు ఉన్న లబ్ది కూడా లేక ఆర్టీసీ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ సిబ్బందికి రావాల్సిన బెనిఫిట్స్ ఏమీ కూడా ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత దక్కలేదని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తులసికృష్ణాపురంలో మత్స్యకారులతో మాట్లాడారు. జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన అరణియార్ ప్రాజెక్టు ఎంతోమందికి జీవనాధారం అయ్యిందని, ఈ ప్రాజెక్టు కింద వందల మంది రైతులు బతుకుతున్నారని అన్నారు. ప్రాజెక్టులో చేపల పెంపకం ఎక్కువగా ఉందని, దీని ద్వారా మత్స్యకారులు వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అలాంటి ప్రాజెక్టుటకు జైకనిధులతో రూ.34 కోట్లు మంజూరు అయితే ఇంత వరకు 20 శాతం పనులు కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తప్పన టిడిపి ప్రభుత్వమే వస్తుందని, ప్రాజెక్టు పనులు పూర్తి చేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పొలాల్లో పనిచేస్తున్న మహిళా కూలీలను ఆత్మీయంగా పలకరిస్తూ ముచ్చటించారు. కూలీలకు రోజువారీ కూలి ఎంత గిట్టుబాటు అవుతున్నదని అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ధరలతో జీవనం సాగించడం కష్టంగా ఉందని, ఉప్పు, పప్పు, కూరగాయలు కొనే పరిస్థితి లేదని కూలీలు వాపోయారు. టిడిపి వచ్చిన వెంటనే పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాలు న్యాయం చేస్తామని చెప్పారు. పాదయాత్ర అనంతరం రాత్రి కెవిబిపురం మండలం రాయిపేడు గ్రామంలో బస చేస్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పంపాక లక్ష్మీ, ఎమ్మెల్సీ కాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు ఇన్‌ఛార్జి హెలెన్, నరసింహయాదవ్, జెడి. రాజశేఖర్, తిరుమల రెడ్డి, ఇలంగోవన్ రెడ్డి, పద్మనాభరాజు, సతీష్ నాయుడు పాల్గొన్నారు.

కెవిబిపురం: మండలంలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, బీద రవిచంద్ర యాదవ్, సత్యవేడు టిడిపి ఇన్చార్జ్ హెలెన్ హేమలత, అధ్యక్షుడు రామంజుల నాయుడు, క్లస్టర్ ఇంచార్జి మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మిద్ది కండిగ వద్ద నాలుగు గంటలకు నారా లోకేష్ బాబును గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న లోకేష్

గుమ్మడి కుతూహలమ్మ కన్నుమూత

పలువుర ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీమంత్రి, డిప్యూటీస్పీకర్ గుమ్మడి కూతుహలమ్మ బుధవారం ఉదయం వారి స్వగృహంలో మరణించారు. గుమ్మడి కూతుహలమ్మ వతరీత్యా వైద్యురాలు. డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మకు డాక్టర్ మునిసిద్దయ్యతో వివాహం జరిగింది. వీరికి ఆనగంటి సురేష్, ఆనగంటి డాక్టర్ హరికష్ణ ఇద్దరు కొడుకులు. చిత్తూరు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేయడం ద్వారా రాజకీయాల్లోకి అడుగులు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 1985, 1989, 1999, 2004 ఎన్నికలలో వేపంజేరి నియోజకవర్గం నుంచి, 2009లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. 1994లో కాంగ్రెస్ నుంచి టికెట్ రాకపోవడంతో వేపంజేరి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. 2014లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పుడు ఓడిపోయారు. 1992-1993 మధ్యకాలంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రివర్గంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇంటిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపతిలోని స్వగహంలో నిద్ర లోనే కన్నుమూసారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

కుతూహలమ్మ (ఫైల్ ఫొటో)

నేడు వి.లక్ష్మిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు

గంగాధరనెల్లూరు: మాజీమంత్రి గుమ్మడి కుతూహలమ్మ బుధవారం ఉదయం తిరుపతిలో మరణించారు. కాగా కుతూహలమ్మ భౌతిక కాయాన్ని గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ వి.లక్ష్మిరెడ్డిపల్లి దళితవాడలో గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆమెకు భర్త డాక్టర్ మునిసిద్ధయ్య, కుమారులు సురేష్, హరిక్రిష్ణ తెలిపారు.

కుతూహలమ్మ మరణం తీరని లోటు
కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

మెడికల్ స్టూడెంట్‌గా, డాక్టర్‌గా, చిత్తూరు జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా కుతూహలమ్మ ఎదిగారన్నారు. రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదిగి, విశేష సేవలు అందించారు. ఆమె మరణించడం ఈ ప్రాంతానికి తీరనిలోటన్నారు. ఒక సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన మహిళ, రాజకీయంగా ఉన్నత పదవులు పొందడం గొప్ప విషయమన్నారు. కుతూహలమ్మ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైందని అన్నారు. దళితులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గొప్ప అవకాశాలు, గుర్తింపు, గౌరవం మరే ఇతర రాజకీయ పార్టీల్లోనూ సాధ్యం కాదని అన్నారు.

కుతూహలమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన చింతామోహన్

కుర్చీలో మూత్రం ఘటన పై విచారణ చేపట్టాలి

కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అధికార మదంతో చిల్లకూరు మండల దళిత జడ్పిటిసి కుర్చీపై మూత్రం పోసి అవమానపరిచిన అమానవీయ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్ళు దాటిపోతున్నా సమాజంలో దళితులు, దళిత ప్రజాప్రతినిధులపై పెత్తందార్ల కులాహంకారదాడులు చోటు చేసుకుంటుండటం సిగ్గు చేటన్నారు. గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం జడ్పీటీసీ శీనయ్యను అదే మండలానికి చెందిన అగ్రవర్ణ వైసీపీ నేత ఒకరు తనముందే కుర్చీవేసుకుని కూర్చుంటావా అంటూ కులం పేరుతో దూషించడమే కాకుండా కుర్చీపై మూత్రం పోవడం అంటరానితనానికి నిలువెత్తు నిదర్శనం కాదా అని వాపోయారు. ఇది అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లు కాదా అంటూ ప్రశ్నించారు. దళిత ప్రజాప్రతినిధుల పరిస్థితే ఇలా ఉంటే మరి సామాన్య దళితుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా కలుగజేసుకుని చిల్లకూరు ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాలనీ, సదరు వైసీపీ నేతపై వెంటనే చర్యలు తీసుకుని దళిత జడ్పీటీసీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపికి సిపాయి రాజీనామా

ఎన్టీఆర్ బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యత నేడు లేదు..
మీడియాతో రష్ హాస్పిటల్ అధినేత సిపాయి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): దాదాపు 15సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగానని, బీసీల పార్టీగా చెప్పుకునే టిడిపిలో బీసీలకు తగిన ప్రాధాన్యత లేదని తెలుసుకొని పార్టీ కేటాయించిన కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు రష్ హాస్పిటల్ అధినేత సిపాయి సుబ్రహ్మణ్యం ప్రకటించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన తన రాజీనామా ప్రతులను పార్టీకి పంపినట్లు తెలిపారు. పార్టీ అభివద్ధి కోసం, తనను నమ్ముకున్న బీసీ క్యాడర్ కోసం కష్టించి పనిచేసినా టిడిపి పార్టీలో గుర్తింపు లేకపోవడంతో మనస్తాపం చెంది ఈ రాజీనామా నిర్ణయాన్ని తీసుకున్నానన్నారు. ఆనాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి వారికి అన్నింట సముచిత ప్రాధాన్యత, పదవులను కట్టబెట్టారన్నారు. కానీ నేడు తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్ పేరు చెప్పుకుంటూ ఆయన అన్నీ వర్గాల అభివద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. బీసీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధ కలిగించిందన్నారు. ఎన్నో పర్యాయాలు పార్టీ హైకమాండ్‌కు తెలిపిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈక్రమంలోనే ఈ రాజీనామా నిర్ణయాన్ని తీసుకున్నానన్నారు. నాపై ఏ రాజకీయపార్టీకి సంబంధించిన వారు ఒత్తిళ్లు చేయలేదని కేవలం తెలుగుదేశం పార్టీలో బీసీలకు జరుగుతున్న అన్యాయంకు నిరసనగా పార్టీ వీడుతున్నానన్నారు. ఇటువంటి సీట్లను ఆశించి పార్టీలో కొనసాగలేదని, నన్ను నమ్ముకున్న బీసీ నాయకులు, బీసీ యువతకు టిడిపి పార్టీలో సముచిత ప్రాధాన్యాన్ని ఇవ్వలేకపోయానన్నారు. తన అనుచరగనంతో చర్చించి తదుపరి కార్యచరణను ప్రకటిస్తానని తెలిపారు.

శిల్ప కళాశాలలో అమ్మకాల కౌంటర్ ఏర్పాటు

విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు చాలా బాగున్నాయి: టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టీటీడీ శిల్పకళాశాల విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల విగ్రహాలతో పాటు, సాంప్రదాయ, కలంకారి చిత్రాలను విక్రయించడం కోసం కళాశాల ఆవరణంలో కౌంటర్ ఏర్పాటు చేస్తామని చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చెప్పారు. కళాశాల ఆవరణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిల్పకళా ప్రదర్శనను బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. కళాశాల విద్యార్థులు తయారుచేసిన శిల్పాలను చూసి వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాశాలలోని వివిధ శిల్పాలను, కలంకారి చిత్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ శిల్పకళను ప్రోత్సహించడానికి టీటీడీ అనేకచర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇందులో భాగంగా కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ సమయంలో వారి పేరుతో లక్ష రూపాయలు డిపాజిట్ చేసి కోర్సు పూర్తయ్యాక వడ్డీతో సహా అందిస్తున్నామని తెలిపారు. ఈమొత్తం వారి జీవనోపాధికి ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. కళాశాలలో రెండేళ్ల కలంకారీ కోర్సులో చేరే విద్యార్థులకు కూడా లక్ష రూపాయలు డిపాజిట్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కళాశాల విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి ప్రత్యేకంగా కషి చేస్తున్న జేఈవో సదాభార్గవిని చైర్మన్ అభినందించారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు మల్లీశ్వరి, డీఈవో భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సుస్థిర అభివృద్ధి కోసం ఆక్వా జోన్ : కలెక్టర్



ఆక్వా కార్యక్రమం పై మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆక్వా రైతుల సుస్థిర అభివద్ధి కోసమే ఆక్వా జోన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించడం కొరకు ఆక్వా కల్చర్ జోన్లను ఏర్పాటు చేయడం ద్వారా ఆక్వా పరిశ్రమను వద్ధిలోకి తెచ్చేందుకు కషి జరుగుతోందని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన తిరుపతి నూతన జిల్లా మొదటిస్థాయి ఆక్వాజోన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత కమిటీ సభ్యులైన కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ, వైజాగ్ ప్రతినిధి జ్ఞానవేల్, ఎంపెడా ఎడి అరవిక్కరసు, ఎస్వీ యూనివర్సిటీ ఆక్వా డిపార్ట్మెంట్ హెచ్ఓడి నాగజ్యోతి, ప్రోగ్రెసివ్ ఫిష్ ఆక్వా రైతులు, మత్స్యశాఖ అధికారులు, ఆర్బికే మత్స్యశాఖ సిబ్బందితో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వాకల్చర్ జోన్లను నోటిపై చేయుటకు నిబంధనల మేరకు రెవెన్యూ విలేజ్‌ల వారీగా ఆక్వాకల్చర్ సాగు చేస్తున్న ప్రాంతాలను గుర్తించి వాటి జియో కోఆర్డినేట్‌లు మ్యాపింగ్ చేసి వాటిని బ్రాకిష్ వాటర్, ఫ్రెష్ వాటర్ ప్రాంతాలుగా నోటిపై చేసేలా చర్యలు ఉండాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, సిరి కల్చర్ సాగు చేస్తున్న రైతుల పొలంలో ఆక్వాసాగు కొనసాగిస్తున్న వారికి ఆటంకం కలిగించరాదని అన్నారు. 10 ఎకరాల లోపు మత్స్య మరియు ఆక్వా కల్చర్ కుంటలను ఏపీఎస్‌ఏడిఏ యాక్ట్ 2020 కింద రిజిస్టర్ అయి నిర్వహిస్తున్న రైతులకు సబ్సిడీతో యూనిట్‌కి రూ.1.50, 10 ఎకరాలపైన వాటికి రూ.3.85 ఒక యూనిట్‌కి వసూలుకి నిబంధనల మేరకు చర్యలు ఉండాలని సూచించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి చాంద్ బాషా కమిటీకి వివరిస్తూ ఆక్వా సాగు చేస్తున్న ప్రాంతాలు జిల్లాలో చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు, కోట మండలాలలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనల మేరకు సర్వే చేశామని తెలిపారు. ఈ మండలాలలో ఆక్వా సాగు 2019 నాటికి 2381.67 హెక్టర్లు ఉండగా, రీసర్వే లో 27 రెవెన్యూ గ్రామాలకు చెందిన అదనపు 782.39 హెక్టార్ల ఆక్వా సాగు గుర్తించామని వాటిని ఆక్వాకల్చర్ జోన్‌గా ప్రకటించుటకు మత్స్యశాఖ వారి జిఓ నెం.16 నిబంధనలకు లోబడి ప్రతిపాదనలు కమిటీ ముందుంచగా జిల్లా కమిటీ ఆమోదించి రాష్ట్రస్థాయి, ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేశారు.

విజయవంతంగా ముగిసిన సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతిసిటీ: సైబర్ క్రైమ్ నివారణ వారోత్సవాలు గత 9రోజులుగా జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి నేతత్వంలో జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, ఉద్యోగ సముదాయాలలో పోలీస్‌శాఖ సైబర్‌క్రైమ్ విభాగం నిర్వహించిన, సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులు నేటితో మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంతో ముగిశాయి. ఈముగింపు కార్యక్రమంలో అదనపు ఎస్పి క్రైమ్ విమలకుమారి ఆధ్వర్యంలో జరిగింది. ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత 9 రోజులుగా జిల్లా వ్యాప్తంగా సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. సైబర్ క్రైమ్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకొని మోసగాళ్ళ భారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా క్రొత్తకొత్త రూపాలతో ఆవిష్కతమవుతున్నాయి. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ విభాగం తిరుపతిలో అత్యాధునిక టెక్నాలజీ తో సైబర్ ల్యాబ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సైబర్ నేరగాళ్ల అట కట్టేందుకు సైబర్ నిపుణులు నిరంతరం కషి చేస్తూ సైబర్ నేరాల బారిన పడి ఇబ్బంది పడుతున్న బాధితుల ఆవేదనను తొలగించడానికి సిబ్బంది సైబర్ నేర పరిశోధనలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పలురకాల సైబర్ మోసాలను పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అదనపు ఎస్పి క్రైమ్ విమలకుమారి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ భారినపడిన బాధితులు వెంటనే 1930కి కాల్ చేయండి లేదా సైబర్ క్రైమ్, గవర్నమెంట్ ఇన్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని లేదా తిరుపతి పోలీస్ గ్రౌండ్‌లో ఉన్న సైబర్ క్రైమ్‌ల్యాబ్ పోలీసులను సంప్రదించి తగిన న్యాయం పొందాలన్నారు. పేటిఎం, బ్యాంకు అకౌంట్, సిమ్ కేవైసి అప్డేట్ చేయమని వచ్చే మెస్సేజ్, కాల్స్‌లకు స్పందించకూడదని అన్నారు. బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగం అంటూ నకిలీ వెబ్‌సైట్లు లేదా మరే ఇతర వెబ్‌సైట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, ఇమెయిల్స్‌ను నమ్మి రిప్లై ఇవ్వరాదన్నారు. సైబర్ క్రైమ్ సిఐ రామచంద్రరెడ్డి మాట్లాడుతూ అనధికారిక యాప్‌లను ఇన్స్టాల్ చేసేటప్పుడు ఎటువంటి పరిశీలన లేకుండా మీకాంటాక్ట్స్, మీడియా, గేలరీ, కెమెరాలకు సంబంధించిన పర్మిషన్లు ఇవ్వరాదని అలా యాక్సెస్ ఇస్తే మీ మొబైల్‌లో ఉన్న వివరాలను, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి, పరువు తీస్తామని బెదిరించి మిమ్మల్ని వేధింపులకు గురిచేస్తారని అందుకే 2 నిమిషాల్లో లోన్ ఇచ్చే నకిలీ యాప్‌లను నమ్మి, మీవెలువైన జీవితాన్ని ఇబ్బందుల్లో పడేయకండన్నారు. మోహన్ బాబు యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ నాగరాజు మాట్లాడుతూ పోలీస్ శాఖ వారు ఏర్పాటు చేసిన ఈ అవగాహనా సదస్సును మనమందరం సద్వినియోగం చేసుకొని, సైబర్ క్రైమ్ బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రముఖ సైబర్ క్రైమ్ నిపుణులు ఐఎల్. నరసింహరావు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గత 9రోజులుగా సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులను నిర్వహించి విద్యార్థులను, ప్రజలను చైతన్యవంతులను చేశారు. ప్రముఖ సైబర్ క్రైమ్ నిపుణులు ఐఎల్.నరసింహరావుని తిరుపతి పోలీసు అతిథి గహం సమావేశ మందిరంలో జిల్లా అదనపు ఎస్పిలు వెంకటరావు అడ్మిన్, కులశేఖర్ లా, ఆర్డర్ ఘనంగా సత్కరించి, సన్మానం చేసి, జ్ఞాపికను అందించి, పోలీస్‌శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మోహన్ బాబు యూనివర్సిటి వైస్‌ఛాన్సలర్ నాగరాజు, తిరుపతి వెస్ట్ డిఎస్పి నరసప్పు, సిఐ సైబర్‌క్రైమ్ రామచంద్ర రెడ్డి, సైబర్ నిపుణులు ఐఎల్.నరసింహరావు, చంద్రగిరి ఎస్ఐ హిమబిందు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారికి నూతన గొడుగులు సమర్పణ

ఎమ్మెల్యే చేతులు మీదుగా అందించిన ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి- క్యాంపస్ శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనంకు కొత్త గొడుగులు సమర్పించారు. తమిళనాడు రాష్ట్రం తిరునింద్రకు చెందిన శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్ట్ వారిచే తయారు చేయించిన నాలుగు గొడుగులు తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంకు తెచ్చారు. ఆలయంలో ప్రత్యేకపూజల అనంతరం శ్రీనివాస మంగాపురం ఆలయం వద్దకు తరలించారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి చేతులు మీదుగా ఆలయ అధికారులకు అందించారు. సుమారు లక్ష రూపాయలతో తయారు చేసిన గొడుగులు స్వామి వారి గరుడసేవకు వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు మోహన్ నాయుడు, నందకుమార్, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ రెడ్డిలు వున్నారు.

సూర్యప్రభపై ముక్కంటీశుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం భూతరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. తొలుత ఆలయంలో మూలమూర్తులకు అభిషేకాలు పూర్తయిన తర్వాత ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పటణంలోని దేవాంగుల సత్రం వద్దకు ఉత్సవమూర్తులను తీసుకువచ్చి వాహనాలపై వేంచేపు చేశారు. భూతరాత్రి సందర్భంగా గంగాదేవి సమేతుడైన సోమస్కందమూర్తిని సూర్యప్రభ వాహనంపై, జ్ఞానప్రసూ నాంబను చప్పరం వాహనంపై ఊరేగించారు. సూర్యకిరణాలు స్వామివారి పాదాలపై పడుతుండగా భక్తులు పరవశు లయ్యారు. వివిధ రకాల వాయిద్యాల నడుమ కర్పూర నీరాజనాలు అందుకుంటూ స్వామి, అమ్మవార్ల ఊరేగింపు సాగింది. అదేవిధంగా బుధవారం రాత్రి స్వామివారు భూత వాహనంపై, శుక వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

శివరాత్రి ఉత్సవాలకు విరాళాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బెంగళూరు చెందిన కె.ఆర్ మార్కెట్ అధినేత ఇరవై టన్నుల కూరగాయలను బుధవారం వితరణ చేశారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా మనుబోలు మండలం జట్ల కోదూరుకు చెందిన వెంకటయ్య దంపతులు ఆలయ గోశాలకు ఆవును వితరణ చేశారు. గోపీనాథ్ రెడ్డి కుటుంబం అమ్మవారికి సుమ 25గ్రాముల బంగారు తాళిబొట్టును వితరణ చేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ



ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: శాసనమండలి ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ అధికారులు బుధవారం సాయంత్రం అమరావతి నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణపై సమీక్షించగా జిల్లా కలెక్టరేట్ నుండి డిఆర్ఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లాలోని ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్న రిటైర్డ్ జెసి చంద్రమౌళి హాజరయ్యారు. రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి కార్యాలయం అధికారులు ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన విధులను వివరించారు. ఆమేరకు రిటర్నింగ్ అధికారి, పిఓల హాండ్ బుక్‌లను అందించనున్నామని తెలిపారు. ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ చెక్‌లిస్టు ఆధారంగా పోలింగ్ ముందు రోజే చేరుకొని ఏర్పాట్ల సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు పోలీస్ భద్రత, ప్రిసైడింగ్ అధికారి డైరీ నిర్వహణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగం, సూక్ష్మ పరిశీలకుల నివేదిక, వెబ్ కాస్టింగ్, వీడియో నిర్వహణ, పరిసరాల్లో పోలింగ్ చట్టం అమలు, పోలింగ్ ముగింపు వంటి వాటిపై వివరించి, స్థానికంగా పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల హాండ్‌బుక్స్ ఆధారంగా అర్థమయ్యే రీతిలో మూడుసార్లు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఆదేశించారు. రిటైర్డ్ జెసి విఆర్.చంద్రమౌళి, ఆర్డీఓలు గూడూరు కిరణ్ కుమార్, శ్రీకాళహస్తి రామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు శ్రీనివాసులు, టి.భాస్కర్‌నాయుడు, తహశీల్దార్లు కుప్పయ్య, పరమేశ్వరస్వామి, అధికారులు పాల్గొన్నారు.

మైథిలీ ఆసుపత్రి ఎదుట బాధితుల ధర్నా

ప్రజాశక్తి-గూడూరు: ఆరోగ్యంగా ఉన్న తన బిడ్డను అన్యాయంగా చంపేశారని ఓ తండ్రి తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఐసీఎస్ రోడ్డులోని మైథిలీ హాస్పిటల్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన తన భార్య శివగామిని మగబిడ్డకు జన్మనిచ్చిందన్నారు. మైథిలీ హాస్పిటల్ లో చూపిస్తే బిడ్డ ఆరోగ్యంగానే ఉందని చెప్పారన్నారు. అయితే నెల్లూరులోని చిన్న పిల్లల వైద్యులకు చూపించాలని సూచించారన్నారు. ఈలోపు మంగళవారం ముక్కుపచ్చలారని తన బిడ్డ చనిపోయాడని.. దీనికి మైథిలీ ఆస్పత్రి నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని, తనకు న్యాయం జరిగేంత వరకు నిరసన కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా బీఎన్‌కండ్రిగ మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటి వద్దకు రాత్రుల్లో సందర్శన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన అనంతరం ఎలా చదువుతున్నారని పర్యవేక్షణ చేస్తున్నామని.. బుధ వారం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నాదెండ్ల మురళీలు రాత్రి పూట సందర్శన చేశారన్నారు. ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు బాగా కృషి చేయాలని సూచించారు. పరీక్షల వరకు తల్లిదండ్రులు సైతం పిల్లలను ఇంటి వద్ద చదివించేందుకు మంచి వాతావరణం కల్పించాలని కోరారు. తాజాగా జరిగిన నిర్మాణాత్మక మూల్యాంకనం పరీక్షలతో పాటు రోజూ జరుగుతున్న విజయ సాధన పరీక్షల మార్కుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. రాత్రి 7 నుంచి 9:30 గంటల వరకు సందర్శించినట్లు తెలిపారు.

జీతం ఇప్పించాలని అంధ ఉద్యోగి వేడుకోలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ఏడాది ఆగస్టు నుంచి తనకు రావాల్సిన జీతం రావడం లేదని పీలేరులోని గిరిజన గురుకుల పాఠశాలలో కాపలాదారుడుగా విధులు నిర్వహిస్తున్న అంధుడు వెంకటముని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వెంకటముని మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగిన తరువాత అన్నమయ్య జిల్లాకు సంబంధించి కొంతమంది ఉద్యోగులకు మ్యాపింగ్ జరగలేదని జీతాలు ఆపేశారన్నారు. అయితే జీతాలు రాకపోవడంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వివరించానన్నారు. జీతం రాకపోవడంతో కుటుంబాన్ని పోషించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పెండింగ్ జీతభత్యాలను ఇవ్వాలని కోరుతున్నానన్నారు. అయితే వ్యక్తిగతంగా తీసుకున్న రుణాలను కట్టాలని ఒత్తిళ్లు చేస్తున్నారని వాపోయారు. కేవలం జీతం పైనే ఆధారపడ్డ తమ కుటుంబం జీతభత్యాలు రాకపోతే ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని విలపించారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు మంత్రి రోజా పసుపు కుంకుమ ఇస్తానని చెప్పారని, మంగళవారం చిత్తూరు పార్లమెంటు మహిళా విభాగం ఆధ్వర్యంలో మంత్రి రోజాకు పసుపు కుంకుమ ఇవ్వడానికి వెళితే తన అనుచర వర్గంతో మహిళలపై దాడులు చేయించి అక్రమ కేసులు బనాయించారని టీడీపీ తిరుపతి పార్లమెంటు మహిళా కార్యదర్శి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాటి మహిళల వద్ద నుంచి మంత్రి రోజా పసుపు కుంకుమ తీసుకోవడానికి ఇష్టపడక మహిళలని చూడకుండా పురుషులతో దాడులకు తెగబడటం దారుణమన్నారు. నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆ పార్టీ మహిళలుగా తాము మంత్రి రోజాకు తిరుపతికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు లతా రాయల్, తరుణ, నీలిమ, కె ఎస్ లత, ఆముదాల మంజుల తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ లో నివాసముంటున్న గుణశేఖర్‌కు వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలో నూతనంగా వివాహం చేసుకునే వారికి పెళ్లి కానుకను అందించడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం చెవిరెడ్డి సేవాతత్వాన్ని అనుసరిస్తూ తిరుమలనగర్ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వరుడు గుణశేఖర్ కు చెవిరెడ్డి పెళ్లి కానుకతో పాటుగా రూ.5,116 నగదు అందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు భారతి, బుజ్జి, ఈశ్వరమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డెస్కుల వితరణ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు ప్రభుత్వ కళాశాలకు చిత్తూరుకు చెందిన యాక్ట్ ఎన్జీవో అధ్యక్షులు డాక్టర్ దశరథరెడ్డి డెస్కులను కళాశాలకు విరాళంగా అందించారని ప్రిన్సిపల్ రామకష్ణంనాయుడు బుధవారం విలేకరులకు తెలిపారు. అడిగిన వెంటనే విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల అభివద్ధి కోసం డెస్కులు విరాళంగా ఇచ్చినందుకు పాఠశాల తరఫున విద్యార్థులతోపాటు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

అందరి సమన్వయంతోనే మండలాభివృద్ధి

ప్రజాశక్తి-కోట: అందరి సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని.. సర్పంచులు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సమిష్టిగా ఉంటూ పంచాయతీల అభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీపీ దాసరి అంజమ్మ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయం సమీపంలోని కమ్యూనిటీ భవనంలో ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని కోట ఎంపీటీసీ సభ్యులు దారా సురేష్ ప్రశ్నించారు. కోట బజారులో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుండి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు మీజూరు మల్లిఖార్జునరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే విద్యుత్‌శాఖ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టును స్థానిక కోట సచివాలయంలో ఉండే వారికి మాత్రమే ఇవ్వాలని, బయట వ్యక్తులకు ఇవ్వరాదని ఎంపీటీసీ సభ్యులు షేక్‌షంశుద్దీన్ డిమాండ్ చేశారు. నెల్లూరు పల్లి కొత్తపాలెం పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఎవరూ తెలపడం లేదని కొత్తపాలెం టీడీపీ ఎంపీటీసీ నారాయణ వాపోయారు. కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, జడ్పీటీసీ దాసరి కోటయ్య, మండల ఉపాధ్యక్షులు ఉప్పల శేషయ్య గౌడ్, వేమారెడ్డి, సౌజన్య రెడ్డి, పలు శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీవోఏ లక్ష్మీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు: మండలంలోని చెన్నూరులో ఆరో సంఘ బంధం నిధులు సుమారు రూ.32 లక్షలకు పైగా దుర్వినియోగమైనట్లు ఆ సంఘ బంధంలోని ఐదు గ్రూపుల సభ్యులు వెలుగు కార్యాలయంలోని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో వెలుగు ఏపీఎం, ఏరియా కోఆర్డినేటర్, వెలుగు సీసీల ప్రమేయం ఉందని పొదుపు సభ్యులు ఆరోపించారు. గూడూరు మండల వెలుగు కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్, వెలుగు ఏపీఎం, వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఏరియా కోఆర్డినేటర్ వెంకట్రావు మాట్లాడుతూ చెన్నూరు ఆరో సంఘ బంధంలో నిధులు దుర్వినియోగం అయిన మాట వాస్తవమే. అయితే ఇందులో వెలుగు ఏపీఎం, ఏసీ, సీసీ దశరథ రామారావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ సంఘ బంధం వీవోఏ లక్ష్మి, సీసీ నరసింహులుకు మాత్రమే ఇందులో సంబంధం ఉందని తెలిపారు. సీసీ నరసింహులుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం బుజ్జమ్మ, సీసీలు దశరథరామయ్య, వెంకటేశ్వర్లు, వెలుగు సిబ్బంది సునీత పాల్గొన్నారు.

రాయలసీమ విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 'రాయలసీమ కరువు -విద్యా, ఉపాధి రంగాల సంక్షోభం - కర్తవ్యాలు' అనే అంశంపై జరిగే రాయలసీమ విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయక భూములన్నీ బీడులుగా మారుతున్నాయి. ఎంతమంది పాలకులు ఈ ప్రాంతం నుంచి అధికారంలోకి వచ్చిన ఇప్పటికీ రాయలసీమ కరవుతో అల్లాడుతున్నది కారణం నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించకపోవడం అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఇక్కడి అభివద్ధి పై దష్టి సారించకపోవడమన్నారు. ఈ ప్రాంతంలో పండించే పత్తి, వేరుశనగ వంటి పంటలకు సంబంధించి నకిలీ విత్తనాలు కారణంగా పంట దిగుబడి రాక పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సరైన విద్యా సౌకర్యాలు లేక విద్యార్థులు పదో తరగతి వరకు మాత్రమే చదివి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబైలాంటి ప్రాంతాలకు వలసలు పోతున్నారు. తగిన పరిశ్రమలు లేకపోవడంతో యువతకు ఉపాధి దొరక్క ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యా, ఉపాధి వ్యతిరేక పాలకుల విధానాలపై పోరాడాలన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్, ప్రొ. పిసి. వెంకటేశ్వర్లు, పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎ.సురేష్ , కె.అశోక్ కుమార్ , ఆర్కియాలజీ డాక్టర్ కె.గోవిందులు, నవయువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.బాషా హాజరవుతారని తెలిపారు. విద్యార్థి, యువకులు, మేధావులు ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.గౌతమి, సోమేష్, విశ్వనాథ్, రుద్రీ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ

ప్రజాశక్తి- పిచ్చాటూరు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ టీడీపీనేనని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల వైసీపీ నాయకులు బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాఫియా టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకుందని.. ఏర్పేడు వద్ద ఇసుక రవాణాకు వ్యతిరేకంగా ధర్నా చేస్తుంటే 9 మందిని లారీతో గుద్ది చంపించడం నిజం కాదా .. అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇసుక అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం టెండర్ ద్వారా గుత్తేదారులు తీసుకొని నడుపుతున్నారని.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదని బొజ్జల గోపాలకష్ణారెడ్డి అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో సుధీర్‌రెడ్డి ఎర్రచందనం రవాణాలో పట్టుపడ్డ వాహనాలు తీసుకొచ్చి వాడుకోవడం నిజం కాదా.. అన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మానవత్వం కలిగిన వ్యక్తి అని.. ఆయనపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై ఆరోపణలు చేయడం గుడ్డు వచ్చి పిల్లని ఎక్కిరించిన చందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హరిశ్చంద్రారెడ్డి, అపరంజిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, ట్రేడ్ యూనియన్ నియోజవర్గ అధ్యక్షుడు సురేష్, ఎంపీటీసీ రమేష్‌రాజు, పాల పద్మనాభం, సచివాలయం అధ్యక్షుడు తొప్పయ్య, మోహన్, చిన్న దొరై, చలపతి రాజు, మునిరాజా, కిరణ్ కుమార్, శేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులు మేనేజ్మెంట్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూజర్స్ కంపెనీ సీఈవో జయతీర్థాచారి సూచించారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్మెంట్, ఎంబీఏ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయి యాజమాన్య సాంకేతిక సమ్మేళనం ఎం-పల్స్-2023 కార్యక్రమాన్ని రాపిడ్ క్లౌడ్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ సీఈవో దాము కామసాని, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సాంకేతిక నైపుణ్యం, మేనేజ్మెంట్ స్కిల్స్, కోడింగ్ వంటి అంశాలు ఎంతో కీలకంగా మారుతాయని విద్యార్థులు ఇటువంటి అవకాశాలను కూడా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆచారి, ఎంసీఏ విభాగాధిపతి సీహెచ్ వాకిన్స్ ధీరజ్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదయాత్రకు అడుగడుగునా హారతులు

ప్రజాశక్తి-క్యాంపస్: భక్తుల గోవింద నామ స్మరణలు.. చెక్క భజనలు.. కోలాటాలు.. డప్పుల వాయిద్యాలు.. వేద మంత్రాలు నడుమ ఆధ్యాత్మిక పాదయాత్ర శోభాయమానంగా సాగింది. చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన సేవకు స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు, శేష మాలలతో కూడిన సారె తీసుకుని శ్రీనివాసమంగాపురం ఆలయం వరకు బయలుదేరిన ఆధ్యాత్మిక పాదయాత్రలో భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు.

దశాబ్ద కాలంగా కొనసాగుతున్న సంప్రదాయం

ఎమ్మెల్యే చెవిరెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో జరిగే బ్రహ్మోత్సవాలకు దశాబ్ద కాలంగా తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న ఆలయం నుంచి పట్టు వస్త్రాలు ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. సారె తీసుకు వెళ్లడంలో తనతో పాటు పల్లెల్లో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

తలకోనలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని బుధవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించనున్నారు. బహుళ చతుర్దశి పుట్టమన్నుతో నవధాన్యాలు సేకరించి వేద మంత్రాల నడుమ శివరాత్రి ఉత్సవాల అంకురార్పణ ఆలయ నిర్వహణ అధికారి జయకుమార్ పాలకమండలి సభ్యులు మాజీ ఛైర్మన్ రేవతి రెడ్డప్పరెడ్డి సమక్షంలో నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలంలో ధ్వజారోహణం నిర్వహించి నాలుగు మాడ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అనంతరం ఈవో జయకుమార్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు పాటు జరుగుతాయని రాత్రి జాగరణ, కల్యాణోత్సవం, సిద్ధ పూజ, పొంగళ్లు జరుగుతాయని తెలిపారు. పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో దోమలను నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఇన్సాఫ్ సమితి సభ్యులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్. జమాలుల్లా, సీనియర్ సభ్యులు షేక్ కాలేషా, ఎండీ. అన్వర్ బాషా, బీఎస్ఎన్ఎల్ యస్థాని, చాన్ బాష, అహ్మద్ బాష, ఫారూఖ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

తమను ఆదుకోవాలని అధికారులకు వినతి

ప్రజాశక్తి-కోట: తాము ఇళ్లు కోల్పోయి ముగ్గురు బిడ్డలతో అల్లాడుతున్నామని.. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతూ బుధవారం నెల్లూరుపల్లి కొత్తపాళెం దళితవాడకు చెందిన వేమాల అన్నపూర్ణ, వెంకటయ్య దంపతులు అధికారులకు విన్నవించారు. బుధవారం కోట తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవానీలకు వినతిపత్రం అందించి సాయం కోరారు.

డిజిటల్ క్యూఆర్ కోడ్ తప్పనిసరి

ప్రజాశక్తి - గూడూరు : పట్టణంలోని ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా డిజిటల్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు తీసుకొని ఆటోలకు అతికించుకోవాలని గూడూరు డీఎస్పీ ఎం. సూర్య నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ లో ఆటో డ్రైవర్లకు నెంబర్లు కేటాయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులు ఆటోలలో ప్రయాణించేటప్పుడు ఇబ్బందికర పరిస్థితుల్లో ఎదురైతే స్టిక్కర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. నేర నియంత్రణలో భాగంగా ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేస్తున్నామని తెలిపారు. వారి ఆటోల్లో ఇవి తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని కోరారు. స్టిక్కర్‌లో డ్రైవరు యజమాని పూర్తి వివరాలు ఉంటాయని, ఏదైనా నేరం జరిగినప్పుడు త్వరితగతిన ఆటోని గుర్తించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ తప్పనిసరిగా స్టిక్కర్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు హజరత్ బాబు, వెంకటేశ్వరరావు, ఎస్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పంచాయతీకి చెందిన రామస్వామి మందడి అనారోగ్యంతో బుధవారం మృతిచెందడంతో విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు కంచి మాధవయ్య, తడుకు సర్పంచి (బొబ్బిలి) వెంకటేష్ యాదవ్ కలసి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

దళిత జడ్పీటీసీని అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-గూడూరు: చిల్లకూరు మండలం పరిధిలోని దళిత, సామాజిక వర్గానికి చెందిన, జడ్పీటీసీని అవమానించిన అధికార పార్టీకి చెందిన నాయకులను కఠినంగా శిక్షించాలని గూడూరు పట్టణ కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులు జడ్పీటీసీ సభ్యుడిగా దళిత సామాజిక వర్గానికి చెందిన మన్నెం శీనయ్య విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పదవి చేపట్టి మూడేళ్లు అవుతున్నా మండల పరిషత్ కార్యాలయంలో కనీసం ఒక టేబుల్, కుర్చీ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఆయన ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు గారి దష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి గది కేటాయించి మన్నెం శీనయ్యకు ఓ గదిని, కుర్చీని ఏర్పాటు చేశారు. దీంతో వైసీపీ. నాయకులు మన్నెం శీనయ్యను పిలిచి కులం పేరుతో దూషించడమే కాకుండా బెదిరించడం జరిగిందని, ఒక దళిత ప్రజాప్రతినిధి కుర్చీపై 'మూత్రం పోసిన' నాయకులు పై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు వెంటనే నమోదు చేయాలని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. సీపీఎం కార్యదర్శి జోగి శివకుమార్, కేవీపీఎస్, సి.ఐ.టి.యు తిరుపతి జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

భూములు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-ఓజిలి: గిరిజనులకు భూములు కల్పించాలని.. ఓ ప్రజాప్రతినిధి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తక్షణం అడ్డుకుని గిరిజన కుటుంబాలకు భూమి కల్పించాలని బుధవారం తాహశీల్దార్ కార్యాలయంలో గిరిజనులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఓజిలి మండలంలోని కుందాం పంచాయతీ పరిధిలోని కుందాం రాచపాలెం గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా 30 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నామన్నారు. తమకు సెంటు భూమి లేక జీవనోపాధి కోసం కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్ల క్రితం నుంచి తమ ఆధీనంలో ఉన్న భూములను.. గత రెండు రోజుల క్రితం రాజకీయ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి రాత్రి వేళల్లో యంత్రాలతో చదును చేస్తుండటంతో అడ్డుకున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు దష్టి సారించి ఈ భూములు తమకు కల్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, ముకుంద, చంద్రకళ ఆధ్వర్యంలో తాహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు.

రైల్వే ఆసుపత్రిలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ రొటేరియన్ డాక్టర్ శ్యామసుందరరావు (శ్యామ్ యాదవ్) ఆధ్వర్యంలో గూడూరు రైల్వే డాక్టర్ శ్రీనివాస్ సుందర్ కుమార్ సూచనలు మేరకు బుధవారం గూడూరు రైల్వే హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీపల్లికొండేశ్వరస్వామి అలంకరణకు బంగారు పట్టలు

ప్రజాశక్తి -సత్యవేడు: నాగలాపురం మండలం సురుటుపల్లిలో వెలసిన శ్రీపల్లికొండేశ్వరస్వామి అలంకరణలో బంగారు విభూది పట్టలను తొడగనున్నారు. 18వ తేదీన శివరాత్రిని పురస్కరించుకొని బంగారు విభూదిపట్టలతో స్వామివారిని అలంకరణ చేయనున్నారు. ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి బుధవారం ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో బంగారు విభూది పట్టలను ఆలయ అర్చకులు కార్తికేయన్‌కు అందించారు. గుంటూరుకు చెందిన దాత నాగార్జున ప్రసాద్ ఈ బంగారు విభూది పట్టలను అందించారు. 111 గ్రాముల బంగారు విభూది పట్టల విలువ దాదాపు రూ.7 లక్షలుర ఉంటుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మంజుల ఉమాపతి, దాసు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పరంధాం, ఖమ్మం జిల్లాకు చెందిన కోలాట మహిళలు శివరంజని, అమరావతి ఆలయ సిబ్బంది శరవణ, పరదామయ్య తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా దాడికి నేటికి నాలుగేళ్లు

ప్రజాశక్తి-క్యాంపస్: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది భారత సైనికులు అమరులై నేటికీ నాలుగేళ్లు కావడాన్ని పురష్కరించుకుని అమరసైనికుల త్యాగాన్ని తిరుపతిలో విశ్రాంత సైనికులు స్మరించుకున్నారు. స్థానిక ఎన్జీవోస్ కాలనీ అమర జవాన్ స్థూపం వద్ద జోహార్లు అర్పించారు. విశ్రాంత సైనికులు ద్వారకనాథ్ రెడ్డి, ఎమ్ఆర్ రెడ్డి, కేసీ రెడ్డి, గోపాల్, ఆనంద్ రెడ్డి, వెంకట్, జగన్, అశోక్, బ్రహ్మానంద స్వామి మాట్లాడారు. పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలు నాలుగేళ్ల కిందట ఇదే రోజున జరిపిన దాడిలో 40 మంది భారత సైనికులు అమరులయ్యారని పేర్కొన్నారు.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

L.A. No.251 / 2022
L.A. No.252 / 2022
L.A. No.253 / 2022
O.S. No.141 / 2016

పల్లపోతు రఘురాం .....పిటిషనరు/వాది

VS

1.వాకాటి చంద్రశేఖర్‌రెడ్డి మరియు వగైరాలు
.... రెస్పాండెంట్సు/ప్రతివాదులు

NOTICE

To
R4. Vakati Syamala W/o. Late Jeevan Reddy,
R5. Vakati Chaitanya Reddy, S/o. Late Jeevan Reddy, both are R/o.4th Floor-C, J.P.Plaza, "B" Block, Near Gurava Reddy Samadhi, Maruthi Nagar, Korla Gunta, Tirupati-517 501.

పై నెంబరు దావాలో మిమ్ములను వారసులుగా చేర్చుమని పిటిషన్లు పెట్టియున్నారు. కావున మిమ్ములను పై ఐ.ఎ.నెంబర్లలో మీ నోటీసు నిమిత్తమై వాయిదా తేది:27.02.2023న వేసియున్నారు. కావున మీరు హాజరై ఉదయం 10.30గం॥ని॥లకు పైన తెలిపిన కోర్టులో మీరుగాని, మీ వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలను తెలుపుకొనవలయును. లేని యెడల మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది:27.02.2023

ఇట్లు
యం.విజయరామరాజు, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్,గూడూరు-524 101,
తిరుపతి జిల్లా.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

L.A. No.254 / 2022
L.A. No.255 / 2022
L.A. No.256 / 2022
O.S. No.153 / 2016

పల్లపోతు రాధ .....పిటిషనరు/వాది

VS

1.వాకాటి చంద్రశేఖర్‌రెడ్డి మరియు వగైరాలు
.... రెస్పాండెంట్సు/ప్రతివాదులు

NOTICE

To
R4. Vakati Syamala W/o. Late Jeevan Reddy,
R5. Vakati Chaitanya Reddy, S/o. Late Jeevan Reddy, both are R/o.4th Floor-C, J.P.Plaza, "B" Block, Near Gurava Reddy Samadhi, Maruthi Nagar, Korla Gunta, Tirupati-517 501.

పై నెంబరు దావాలో మిమ్ములను వారసులుగా చేర్చుమని పిటిషన్లు పెట్టియున్నారు. కావున మిమ్ములను పై ఐ.ఎ.నెంబర్లలో మీ నోటీసు నిమిత్తమై వాయిదా తేది:27.02.2023న వేసియున్నారు. కావున మీరు హాజరై ఉదయం 10.30గం॥ని॥లకు పైన తెలిపిన కోర్టులో మీరుగాని, మీ వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలను తెలుపుకొనవలయును. లేని యెడల మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది:27.02.2023

ఇట్లు
యం.విజయరామరాజు, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్,గూడూరు-524 101,
తిరుపతి జిల్లా.